


దేశభక్తి.. సేవా స్ఫూర్తి..
సైనిక్ పాఠశాలల్లో 6,9 తరగతుల ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఆసక్తి గల విద్యార్థుల నుంచి అధికారులు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.

10లో



స్వామి సాక్షిగా పక్షపాతం
ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయం ప్రస్తుతం కూటమి నాయకుల చేతుల్లోకి వెళ్లిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

డెల్టాకు 9,745 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 9,745 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజ్ వద్ద నీటి మట్టం 9.50 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఓఎన్జీసీ పరిహారం పంపిణీకి గ్రీన్ సిగ్నల్

- 'సాక్షి' కథనానికి స్పందన
- ఈ నెల 28న అందజేసేందుకు ఏర్పాట్లు
- అధికారులతో సమీక్షించిన కలెక్టర్



ఓఎన్జీసీ పరిహారం పంపిణీపై సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

సాక్షి ఇంపాక్ట్

సాక్షి, అమలాపురం: ''చంద్రబాబు రావాలి... మత్స్యకార పరిహారం అందించాలి' అని రోజుల తరబడి కాలయాపన చేస్తున్న ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు), అధికార యంత్రాంగం ఎట్టకేలకు దిగివచ్చారు. ఇప్పుడప్పుడే సీఎం చంద్రబాబు వచ్చే పరిస్థితి లేకపోవడానికి తోడు లబ్ధిదారుల నుంచి వస్తున్న వ్యతిరేకతతో తప్పనిసరి పరిస్థితుల్లో పరిహారం అందించేందుకు సిద్ధమయ్యారు. ఓఎన్జీసీ సంస్థ పరిహారాన్ని కలెక్టర్‌కు అందజేసి నెలలు గడుస్తున్నా, చంద్రబాబు కోసం పంపిణీ చేయకుండా చూస్తున్నారు. ఈ విషయంపై ఈ నెల 23న 'సాక్షి'లో 'పరిహారానికి కాలయాతన' అనే శీర్షికతో వార్త వెలుగులోకి విషయం తెలిసిందే. దీనితో దిగివచ్చిన జిల్లా యంత్రాంగం ఈ నెల 28వ తేదీన ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని తాళ్లరేవు (కాకినాడ జిల్లా) కోరంగిలో ఓఎన్జీసీ పరిహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం రాకున్నా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర గనులు, ఆబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగనుంది.

రెండు జిల్లాల పరిధిలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల పరిధిలోని కేజీ బేసిన్‌లో ఓఎన్జీసీ కార్యకలాపాల వల్ల వేట కోల్పోయి, నష్టపోయిన మత్స్యకారులకు పరిహారం అందించాల్సి ఉంది. కోనసీమ జిల్లాలోని ఏడు మండలాల పరిధిలో 54 గ్రామాలకు చెందిన 16,408 మంది మత్స్యకారులకు ఐదున్నర మాసాలకు గాను ఒక్కొక్కరికి రూ.11,500 చొప్పున రూ.63,250 ఇవ్వాలి. మొత్తం రూ.103,78,00,600 ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలోని 15 గ్రామాలకు చెందిన 7,050 మత్స్యకారులకు రూ.44,59,12,500ను వారి ఖాతాల్లో జమ చేయనున్నారు.

అధికారులతో సమావేశం

తాళ్లరేవు మండలం కోరంగిలో ఈ నెల 28న ఓఎన్జీసీ పరిహారం పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు.

భరోసా లేనట్టేనా?

సముద్ర వేట నిషేధ సమయంలో ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు ఇవ్వాల్సిన మత్స్యకార భరోసా పంపిణీపై ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదు. ఓఎన్జీసీ పరిహారంతో పాటు మత్స్యకార భరోసా సొమ్ములు తమ ఖాతాలలో పడతాయని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేట కోల్పోయిన మత్స్యకార కుటుంబానికి ఏడాదికి రూ.పది వేలు చొప్పున పరిహారంగా అందించింది. 2023–24 ఏడాదికి 9,821 మందికి రూ.9,82,10,000 జమ చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం 2024–25 సంవత్సరానికి 11,305 మంది లబ్ధిదారులను గుర్తించింది. ఎన్నికల సమయంలో మత్స్యకార భరోసాను రూ.20 వేలకు పెంచుతానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ విధంగా చూస్తే ఈ ఏడాది మత్స్యకార భరోసా రూ.22.61 కోట్లు అందించాల్సి ఉంది. మత్స్యకార భరోసాకు కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపినట్టేననే విమర్శలు వస్తున్నాయి.

తీరంలో భద్రతను మెరుగుపర్చాలి

అమలాపురం రూరల్: సముద్ర తీర ప్రాంత భద్రతను మరింత మెరుగుపరిచేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. విశాఖపట్నం కోస్టల్ సెక్టార్ పోలీస్ అడిషనల్ ఎస్పీ మధుసూదనరావు, జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు, కోస్ట్ గార్డ్ అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్ర ప్రాంతంలోని మేకనైజ్డ్ బోట్లకు ట్రాన్స్‌ఫండర్స్ కమ్యునికేషన్ వ్యవస్థను అమర్చాలన్నారు. తద్వారా భద్రత, రక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. సముద్ర ప్రాంతంలో నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు పెట్రోలింగ్ కార్యక్రమాలను బలోపేతం చేయాలన్నారు.

ఖనికట్టు!

- చైనా క్లే ఖనిజం గుట్ట మాయం
- కూటమి నేతల పక్కా ప్లాన్
- ప్రముఖ వ్యాపారి మధ్యవర్తిత్వం
- టన్ను రూ.4000కు తెగనమ్మేసిన వైనం
- పక్షం రోజులైనా పట్టించుకోని అధికారులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అధికార పార్టీ అండదండలతో కూటమి నేతలు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు అనే తేడా లేకుండా అడ్డగోలుగా అందినంతా దోచుకుపోతున్నారు. అధికారులు మాత్రం జీ హుజూర్ అంటూ కళ్లప్పగించి చూస్తున్నారు. అధికారం పంచుకున్న తరహాలోనే అవినీతి, అక్రమాల్లో సైతం నీకు సగం, నాకు సగం అంటూ తెలుగుదేశం, జనసేన నేతల మధ్య పంపకాలు గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతున్నాయి. మెట్ట ప్రాంత కేంద్రం జగ్గంపేటలో కూటమి నేతలు అక్కడి ప్రజాప్రతినిధుల పేరు చెప్పి చైనా క్లే (విలువైన సుద్దమట్టి) ఎత్తుకుపోయారు. అదీ కూడా రెవెన్యూ అధికారుల స్వాధీనంలో ఉన్న రూ.లక్షల విలువైన సుద్దమట్టి. అది గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అక్రమాలకు అడ్డుకట్ట వేసి మైనింగ్ అధికారులు సీజ్ చేసి అధికారికంగా అక్కడి తహసీల్దార్‌కు అప్పగించినదే కావడం గమనార్హం. ఎంతటి ధైర్యం, తెగింపు, నాయకుల అండదండలు ఉండకుంటే రెవెన్యూ యంత్రాంగం స్వాధీనంలో ఉన్న విలువైన చైనా క్లేను మాయం చేసేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇదంతా రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలకు తెలియకుండా జరగలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అక్రమాలపై వైఎస్సార్ సీపీ హయాంలో ఉక్కు పాదం

నియోజకవర్గ కేంద్రం జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో ఖనిజం (చైనా క్లే–సిరామిక్స్ టైల్స్‌లో వినియోగించే ఖరీదైన సుద్ద మట్టి) ఉంది. ప్రధానంగా మల్లిసాల– రామవరం – గుర్రంపాలెం రోడ్డుకు ఆనుకుని చైనా క్లే ఖనిజ వనరులున్నాయి. వీటిలో ప్రధానంగా జగ్గంపేట నియోజకవర్గ కేంద్రానికి కేవలం కిలోమీటరు దూరంలో ఉన్న రామవరంలో రెవెన్యూ యంత్రాంగం అధీనంలో ఉన్న చైనా క్లేను రాత్రికి రాత్రి తరలించేసినా మండల రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటం వెనుక కూటమి నేతల ఒత్తిళ్లు బలంగా పనిచేస్తున్నాయి.

సిరామిక్స్‌కు ఉపయోగించే ఈ సుద్దమట్టిని ప్రభుత్వ పోరంబోకు భూముల్లో అక్రమంగా తవ్వి కూటమి నేతలు రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటి అధికారులు అక్రమాలపై ఉక్కుపాదం మోపారు. మట్టి తవ్వకాలు ముందుకు సాగకుండా దాదాపు కట్టడి చేశారు. ఇదంతా 2021లో చోటు చేసుకుంది. రామవరం వద్ద ప్రభుత్వ పోరంబోకు భూముల్లోని 107, 109 సర్వే నంబర్‌లలో అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నట్టు నిగ్గుతేల్చి సుద్దమట్టి (చైనా క్లే)గా మైనింగ్ అధికారులు నిర్ధారించుకుని సీజ్ చేశారు. 2021లో జిల్లా మైనింగ్ అధికారులు 2009 క్యూబిక్ మీటర్ల సుద్దమట్టిని జగ్గంపేట మండలం రామవరం వద్ద సీజ్ చేసి తహసీల్దార్ పర్యవేక్షణలో ఉంచారు.



తవ్విన సుద్దమట్టిని గుట్టగా వేసిన దృశ్యం (ఫైల్)

ఆ రాత్రి మొత్తం ఊడ్చేశారు

టీడీపీ సీనియర్ నాయకుడు, టీటీడీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ ప్రాతినిధ్యం వహిస్తోన్న జగ్గంపేట నియోజకవర్గం రామవరంలో రెవెన్యూ కనుసన్నల్లో ఉన్న సుద్దమట్టి మాయమైంది. సుద్దమట్టి మాయమైన గ్రామంలో టీడీపీకి అన్నీ తానే అన్నట్టుగా వ్యవహరిస్తోన్న ద్వితీయ శ్రేణి నాయకుడు చక్రం తిప్పారు. స్థానికంగా కొందరు కూటమి నేతలు పథకం ప్రకారం సీసీ కెమెరాలు కూడా పనిచేయకుండా చేసి సుమారు రు.రెండుకోట్ల విలువైన సుద్దమట్టిని రాత్రికి రాతే సరిహద్దులు దాటించేశారు. మైనింగ్ అధికారులు సీజ్ చేసిన 2009 క్యూబిక్ మీటర్ల సుద్దమట్టి సుమారు 500 టన్నులు ఉంటుందని నాడు మైనింగ్ అధికారులు అంచనా వేశారు. ఆ రోజు రాత్రి ఏకకాలంలో 60 నుంచి 70 పది చక్రాల లారీలను వినియోగించి సుద్దమట్టిని తరలించేశారు. తెల్లారే సరికి తట్ట మట్టి కూడా లేకుండా మొత్తం ఊడ్చేశారు.

ఖరీదు కట్టిన షరాబు!

ఈ వ్యవహారంలో ఆ ప్రాంతానికి చెందిన ఒక ప్రముఖ వ్యాపారి పాత్ర కూడా ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అటు కూటమి నేతలకు, ఇటు అధికారులకు మధ్యవర్తిగా ఆ వ్యాపారే వ్యవహరించారంటున్నారు. టన్నుకు ధర ఇంత అన్న విషయాన్ని కూడా ఆ వ్యాపారే నిర్ణయించారంటున్నారు. మొదట రూ.2,500 అంటే పొసగని ఒప్పందం టన్నుకు రూ.4,000 వంతున అనేసరికి కుదిరిందని సమాచారం. ఈ సొమ్ములో 70 శాతం కూటమి నేతలకు, 30 శాతం పోలీసు, రెవెన్యూ శాఖలకు ముట్టజెప్పారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. డివిజన్ నుంచి మండల స్థాయి వరకు పోలీసు, రెవెన్యూ శాఖలకు తలాకొంత ముట్టచెప్పడంతో ఉదాసీనంగా ఉంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అడ్డగోలుగా సుద్దమట్టి తరలించుకుపోయి పక్షం రోజులవుతున్నా ఇంతవరకు ఎటువంటి చర్యలు కనిపించకపోవడం కూటమి నేతలు ముడుపులు మెక్కారనే ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి.



సుద్దమట్టి గుట్టలను తరలించుకుపోయిన అనంతరం సమతలంగా ఉన్న నేల

ఫిర్యాదు చేసినా చర్యలు లేవు



రామవరంలో సుద్ద మట్టి మాయంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. ప్రభుత్వ సొమ్ము దోచేసినా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం అన్యాయం. చడీచప్పుడు లేకుండా తరలించుకుపోయారు. ఈ విషయం ప్రజలందరికీ తెలిసినా అధికారులు ఏమీ చేయకపోవడాన్ని ఏమనుకోవాలి. అక్రమంగా తరలించుకుపోయిన మట్టి డబ్బు.. ప్రభుత్వ ఖజానాకు కట్టించాలి.

– మేకా వీరబాబు, గ్రామ నేత, రామవరం

విచారణ జరుపుతున్నాం



రామవరంలో సీజ్ చేసిన సుద్ద మట్టి మాయం కావడంపై విచారణ చేస్తున్నాం. ఈ మొత్తం వ్యవహారంలో వాస్తవాలేమిటనేది రికార్డులు పరిశీలిస్తున్నాం. సుద్ద మట్టిని ఎవరు, ఎక్కడకు తరలించారనే దానిపై ఆరా తీస్తున్నాం. విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– జేవీఆర్ రమేష్, తహసీల్దార్, జగ్గంపేట

అర్జీలకు సంతృప్తికర పరిష్కారం

అధికారులకు జేసీ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: ప్రజా విజ్ఞాపన పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ద్వారా అందిన అర్జీలపై సంతృప్తికరమైన పరిష్కారాలను అందించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా జిల్లా అధికారులను కోరారు. మంగళవారం కలెక్టరేట్ వివేకానంద సమావేశపు హాలులో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై జిల్లా అధికారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో జె.వెంకట్రావు, సీపీవో పి.త్రినాథ్ అధికారులకు జిల్లాలో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కార ప్రగతి, మరింత మెరుగైన పరిష్కార సేవలు అందించేందుకు జిల్లా అధికారులు చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. పీజీఆర్ఎస్ ర్యాంకింగ్ ప్రధానంగా ఐదు పరిమితుల ఆధారంగా నిర్ణయిస్తారన్నారు. ప్రజల నుంచి అందిన అర్జీల సంఖ్య, నిర్దిష్ట కాలపరిధిలో పరిష్కరించిన అర్జీల సంఖ్య, అర్జీదారులకు సంతృప్తితో అందించిన నాణ్యమైన పరిష్కార సంఖ్య, ప్రజాప్రతినిధులు సూచించిన అంశాలపై పరిష్కారాలు, వాటిలో సంతృప్తి నందించిన పరిష్కారాలు అనే అంశాల ఆధారంగా జిల్లాలకు ర్యాంకింగ్ ఇస్తారన్నారు. జిల్లాలో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కార స్థాయి 62.7 శాతంగా ఉందన్నారు. ఆర్డీవోలు ఎస్ మల్లిబాబు, కె శ్రీరమణి, డీఎల్‌డీవో కె వాసుదేవరావు, డీఆర్వో వెంకట్రావు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కరెంట్ చార్జీల బాదుడుపై పోరుబాట



పోరుబాట పోస్టరును ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు, నాయకులు

- పోస్టరు ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు
- 27న అన్ని నియోజకవర్గాల్లోని విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసనలు

కాకినాడ రూరల్: కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమం ద్వారా డిసెంబరు 27న సామాన్యులకు అండగా కూటమి సర్కార్‌పై నిరసనలు చేపట్టబోతున్నట్టు ఆ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు పేర్కొన్నారు. పోరుబాట కార్యక్రమం పోస్టర్లను కాకినాడ వైద్యనగర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద నాయకులతో కలిసి మంగళవారం ఆయన ఆవిష్కరించారు. కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీలు పెంచి వినియోగదారులపై భారం వేయడంతో తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లాలో అన్ని నియోజవకర్గాలలో శుక్రవారం ర్యాలీలు నిర్వహించి, విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడతామన్నారు. ఎన్నికల సభల్లో సీఎంగా జగన్ ఎక్కువ విద్యుత్ చార్జీలు పెంచినట్టుగా చంద్రబాబు ప్రచారం చేయడంతో పాటు తాము అధికారంలోకి వచ్చిన తరువాత చార్జీలు తగ్గిస్తామని పదే పదే చెప్పేవారన్నారు. దుర్మార్గంగా అధికారంలోకి వచ్చిన 6నెలల్లోనే రూ.15,485 కోట్ల భారాన్ని మోపబోతున్నారన్నారు. పేద, ఎస్సీ, ఎస్టీ, ప్రతి వినియోగదారుడు భారాన్ని మోయవల్సిన పరిస్థితి తీసుకువచ్చారన్నారు. గతంలో బాకీలు ఉన్నాయని ఇప్పుడు వసూలు చేస్తున్నారని, దానికోసం దళిత వాడల్లో వినియోగదారుల ఇళ్ల నుంచి మీటర్ల ఫ్యూజులు పట్టుకుపోతున్నారన్నారు. వారు చీకట్లో మగ్గిపోవాలా అని ప్రశ్నించారు. 27న చేపట్టబోయే నిరసన కార్యక్రమాలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి కుమార్, కాకినాడ సిటీ పార్టీ నాయకుడు సుంకర విద్యాసాగర్, కరప మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, సీనియర్ నాయకుడు పుల్ల కోటేశ్వరరావు, పార్టీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు అల్లి రాజబాబు, బ్రహ్మానందం, కృష్ణంరాజు పాల్గొన్నారు.

జీతాలకు గ్రీన్ సిగ్నల్

- జీజీహెచ్ ఉద్యోగులకు ఉపశమనం
- ఏపీ ఎన్‌జీవో నేతల చొరవతో చెల్లింపునకు అనుమతి

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లోని శాంక్షన్ పోస్టుల్లో చోటు చేసుకున్న అక్రమాల్లో పావులుగా మారిన 2021 రిక్రూట్‌మెంట్‌కు చెందిన ఉద్యోగులకు సాంత్వన చేకూరింది. గత నెల జీతాలు అందక ఇబ్బందిపడ్డ వారి వేదనకు ఉపశమనం లభించింది. ఏపీ ఎన్‌జీవో నేతల చొరవతో వారి జీతాల చెల్లింపునకు ఖజానా శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ మేరకు మంగళవారం జీతాల బిల్ పాస్ అయింది. మంగళవారం ఏపీఎన్‌జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నేతలు ట్రెజరీ అధికారులను కలిశారు. ఎస్టీవో సోమయాజులుకు. డీడీ కె.శ్రీనివాసులుకు సమస్య విన్నవించారు. శాంక్షన్ పోస్టుల్లో చోటు చేసుకున్న అవినీతితో ఎటువంటి సంబంధం లేని వందల మంది ఉద్యోగులు చర్యలకు బలవుతున్నారన్నారని చెప్పారు. శాంక్షన్ పోస్టుల్లో అవినీతికి పాల్పడిన అధికారి, అతడి ద్వారా లబ్ధి పొందిన 12 మంది వల్ల 190 మంది ఉద్యోగులు గత నెల జీతాలు రాక విలవిలలాడుతున్నారన్నారు. పండుగ వేళలు, జీతాలపై ఆధారపడి బతుకుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాల స్థితిని పరిగణించాలని విన్నవించారు. పసుపులేటి శ్రీనివాస్ ఆయన బృందం వినతి మేరకు సానుకూలంగా స్పందించిన అధికారులు జీజీహెచ్ డీడీ నుంచి అండర్ టేకింగ్ లెటర్ తీసుకున్నారు. అనర్హులకు జమ అయితే తిరిగి ఖజానాకు చలానా రూపంలో బదలాయించే బాధ్యత తమదేననే హామీ తీసుకున్నారు. ఆ వెంటనే జీతాల బిల్ పాస్ చేశారు. వచ్చే నెల 1వ తేదీ తర్వాత గత నెల జీతంతో పాటు ఈ నెల జీతం ఉద్యోగులు అందుకోనున్నారు. ఖజానా శాఖ అధికారులను కలిసిన వారిలో ఏపీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహన్, కార్యదర్శి పేపకాయల వెంకట కృష్ణ, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, సిటీ అధ్యక్షుడు ఏ.సత్తిరాజు, ట్రెజరీ జిల్లా అధ్యక్షుడు పాము శ్రీనివాస్ ఉన్నారు.



ట్రెజరీ అధికారులను కలిసి విన్నవించిన ఏపీఎన్‌జీవో నేతలు

ట్రాన్స్‌కో కార్యాలయాన్ని పరిశీలించిన సీఎండీ

సామర్లకోట: ట్రాన్స్‌కో సీఎండీ ఐ పృథ్వీ తేజ్ మంగళవారం సాయంత్రం స్థానిక సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. విద్యుత్తు పనులకు సంబంధించిన మెటీరియల్ స్టోర్ నిల్వ చేసే ప్రదేశం సామర్లకోట విద్యుత్తు సబ్ స్టేషన్‌లో అనువుగా ఉంటుందని, ఈ మేరకు స్థలం ఉన్నదనే సమాచారం మేరకు ఆయన సబ్ స్టేషన్‌లో స్థలాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు మెటీరియల్ బొమ్మూరులో నిల్వ చేయడం వల్ల అనేక ప్రాంతాలకు దూరంగా ఉండటం, కాకినాడ జిల్లాకు సామర్లకోట ముఖ్యకూడలి ప్రదేశంగా ఉంటుందనే అభిప్రాయంతో సబ్ స్టేషన్‌లో స్థలాన్ని పరిశీలించారు. దీనిలో భాగంగా కార్యాలయంలో రికార్డులను పరిశీలించి అధికారులకు సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రసాద్, ఈఈ ఎవీఎన్‌డీఎస్ ప్రభాకర్, డీఈలు శ్రీనివాసు, ఎడీఈ కిరణ్‌కుమార్, ఎఈలు నాగేశ్వరరావు, బి.రమేష్‌కుమార్ పాల్గొన్నారు.



సామర్లకోట విద్యుత్తు సబ్ స్టేషన్‌లో స్థల పరిశీలన చేసిన సీఎండీ, ఈఈ తదితరులు

దైవ కుమారునికి సుస్వాగతం

- క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం
- లోక రక్షకుని రాకడ కోసం ఊరూవాడా ముస్తాబు
- వెలుగులు విరజిమ్ముతున్న చర్చిలు
- ప్రారంభమైన ప్రత్యేక ప్రార్థనలు
- క్రీస్తు సందేశాలను స్మరించుకుంటూ పులకరిస్తున్న క్రైస్తవులు



సామర్లకోటలోని సెంటినరీ బాప్టిస్టు లూథరన్ చర్చి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): క్రిస్మస్ వేడుకలు బుధవారం ఆనందోత్సాహాలతో నిర్వహించుకొనేందుకు ఊరువాడా ముస్తాబయ్యాయి. కరుణామయుని పుట్టిన రోజు వేడుకలు మనసారా నిర్వహిస్తూ, పునీతులయ్యేందుకు క్రైస్తవ సోదరులు ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. దీంతో క్రైస్తవులు ఇంట పండగ వాతావరణం నెలకొంది. ప్రతి చర్చిని ప్రత్యేకంగా అలంకరించి మంగళవారం రాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు.

స్పిరిట్ ఆఫ్ క్రిస్మస్

లోక రక్షకుడైన ఆ క్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా జరిగే సంబరాలు అన్నీ ఇన్నీ కావు. క్రైస్తవులకు ఈ నెల రోజులు హాలిడే సీజన్, సీజన్ ఆఫ్ గివింగ్ జరుపుకుంటారు. ప్రభువు రాకడను సూచిస్తూ క్రైస్తవులు ఇప్పటికే తమ ఇళ్లలో కాంతులు ప్రసరించేలా స్టార్‌లు ఏర్పాటు చేశారు. క్రిస్మస్ ట్రీలు అలకరించారు. బాల ఏసు పశువుల పాకలో పుట్టిన దృశ్యాన్ని ఇళ్లు, చర్చిల్లో బొమ్మల రూపంలో అందంగా రూపొందించారు. కాకినాడ జిల్లాలో 1,500కు పైగా పెద్ద చర్చిలు, 3 వేలకుపైగా చిన్న చర్చిలు ఉన్నాయి. లూథరన్ , బాప్టిస్ట్, రోమన్ కేథలిక్, మన్నా మిషన్, బైబిల్ మిషన్, బెయోర్షబా, ఏసు ప్రేమాలయం తదితర క్రైస్తవ శాఖల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. కేంద్రమైన కాకినాడలో క్రేగ్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి, సెయింట్ లూథరన్ చర్చి, గాంధీనగర్‌లోని హౌస్ ఆఫ్ ప్రేయర్, ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి, జగన్నాథపురంలోని చర్చి స్కేర్ సెంటర్‌లోని రోమన్ కేథలిక్ చర్చి, ఆంధ్రా బాప్టిస్ట్ చర్చిలు ఎంతో అందంగా ముస్తాబు చేశారు. బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. పిఠాపురంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, తుని ఆంధ్రా బాప్టిస్ట్, చర్చి, నాసా చర్చిలు, పెద్దాపురంలోని లూథరన్ చర్చి, బైబిల్ మెషీన్, బాప్టిస్ట్ చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గోకవరంలోని సెయింట్ జాన్స్ లూథరిన్ చర్చి, ఈహెచ్‌హెచ్ చర్చి, ఏలేశ్వరంలో పట్టణంలోని లూథరన్, ఆర్‌సీఎం, సీఓఎం చర్చిల్లో వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు ప్రత్యేక ఆరాధన

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని అన్ని చర్చిల్లో బుధవారం ఉదయం 9.30 నుంచి 12.30 వరకూ ప్రత్యేక ఆరాధన నిర్వహిస్తారు. ఈ సందర్భంగా క్రిస్మస్ సందేశం అందించడానికి ప్రత్యేక అతిథులను ఆహ్వానిస్తారు. ప్రత్యేకంగా క్రిస్మస్ గీతాలు ఆలపించి కేక్ కట్ చేస్తారు. కొన్ని చర్చిల్లో క్రీస్తు వెలుగుకు గుర్తుగా కొవ్వొత్తులు వెలిగించి క్యాండిల్ సర్వీస్ నిర్వహిస్తారు. క్రీస్తు వెలుగు కలిగి ఉంటామని చర్చిల్లో ప్రమాణం చేస్తారు. క్రైస్తవ సోదరులు, సోదరీమణులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొంటారు. క్రిస్మస్ కానుకలు పంచుకొంటారు.

క్లుప్తంగా

డొక్కతాడు దగ్ధం


బి.దొడ్డవరంలో కాలిపోతున్న డొక్కతాడు

మామిడికుదురు: బి.దొడ్డవరంలో ఎగుమతికి సిద్ధంగా ఉన్న ఆరు టన్నుల డొక్కతాడు కాలిపోయింది. బాధితులు చింతపల్లి శ్రీనివాస్, బొలిశెట్టి ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్‌కు ఎగుమతి చేసేందుకు ఈ డొక్కతాడును సిద్ధం చేశారు. గోడౌన్ బయట ఉంచిన ఈ తాడు నుంచి మంగళవారం తెల్లవారుజామున మంటలు వచ్చాయి. స్థానికుల సమాచారంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. సుమారు రూ.రెండు లక్షల విలువైన డొక్కతాడు పూర్తిగా కాలిపోయింది. రాజోలు అగ్ని మాపక కేంద్రం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణం తెలియలేదు. గ్రామ సర్పంచ్ చెల్లుబోయిన రామశివ సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటరమణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

27న నిధి ఆప్‌కే నికట్

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈ నెల 27వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నిధి ఆప్‌కే నికట్ – డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నారు. ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 వైడీ శ్రీనివాస్ మంగళవారం ఈ విషయాన్ని తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం పీడబ్ల్యూడీ వర్కుషాపు, కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆదిత్య స్కూల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం మండలం ఐనాపురం పీఏసీఎస్ (సొసైటీ), ఏలూరు జిల్లా తాడేపల్లిగూడెంలోని సాక్షి కార్యాలయం, పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం సమీపంలోని సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల, అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం పనసలపాలెంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాల, గంగవరం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాల, మారేడుమిల్లిలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్మెంట్లు, కొత్తగా కవర్ చేసిన ఎస్టాబ్లిష్మెంట్లు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. పింఛనుదారులు తమ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించడానికి అవకాశం ఉందన్నారు.

దేశభక్తి.. సేవా స్ఫూర్తి..

- సైనిక్ పాఠశాలల్లో ప్రవేశానికి నోటిఫికేషన్
- ఆరు, తొమ్మిది తరగతుల్లో చేరే అవకాశం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): దేశ సరిహద్దుల్లో నిరంతరం గస్తీ కాస్తూ, ప్రజల ప్రాణాలను కాపాడే సైనికుల గొప్పదనాన్ని ఎంత కొనియాడినా తక్కువే. ప్రజలందరూ సుఖంగా, సంతోషంగా ఉన్నారంటే సరిహద్దుల్లో వారు చేస్తున్న త్యాగాలే కారణం. అలాంటి అత్యుత్తమ ఉద్యోగంలోకి వెళ్లాలంటే దేశభక్తి, కఠిన సాధన, క్రమశిక్షణ చాలా అవసరం. ఇలాంటి విద్యార్థులకు సైనిక్ పాఠశాలలు చక్కని అవకాశం కల్పిస్తున్నాయి.

నోటిఫికేషన్ విడుదల

దేశ రక్షణలో భాగంగా త్రివిధ దళాలకు అవసరమైన సైనిక అధికారులను తయారు చేయాలనే లక్ష్యంతో దేశ వ్యాప్తంగా సైనిక్ పాఠశాలలను ప్రారంభించారు. వీటిలో ఆరో తరగతిలో ప్రవేశానికి బాలబాలికలు, తొమ్మిది తరగతికి బాలురు మాత్రమే అర్హులు. ఈ పాఠశాలల్లో సీటు పొందడానికి ప్రవేశ పరీక్ష ఉత్తీర్ణులు కావడంతో పాటు వైద్య పరీక్షల్లో విజయం సాధించాలి. ఇక్కడ ఇంటర్మీడియట్ వరకు చదువుకోవచ్చు. ఈ నేపథ్యంలో సైనిక్ పాఠశాలల్లో 2025–26 ఏడాదిలో ఆరు, తొమ్మిదో తరగతుల్లో ప్రవేశం పొందడానికి నోటిఫికేషన్ విడుదలైంది.

రిజర్వేషన్లు

సైనిక్ పాఠశాలల్లో సీట్లను రిజర్వేషన్ల ఆధారంగా భర్తీ చేస్తారు. ఎస్సీలకు 15, ఎస్టీలకు 7.5, రక్షణ శాఖలో పనిచేస్తున్న వారు, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు 25 శాతం సీట్లను కేటాయిస్తారు. ఆరో తరగతిలో 80, తొమ్మిదో తరగతిలో 20 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేస్తారు.

సౌకర్యాలు

ఆరు నుంచి ఇంటర్ వరకు విద్య, వసతితో పాటు, ఎన్‌సీసీ, యోగా, చిత్రలేఖనం, సంగీతం, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, ఈత, గుర్రపు స్వారీ తదితర వాటిలో శిక్షణ ఇస్తారు. మొదటి ఏడాది ఫీజుగా రూ.1.10 లక్షలు చెల్లించాలి. విద్యలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 50 శాతం విద్యార్థులకు రక్షణ శాఖ నుంచి రూ.53 వేల చొప్పున ఉపకార వేతనం అందుతుంది. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పొందవచ్చు. సైనిక్ పాఠశాలలో ఇంటర్మీడియట్ పూర్తయిన తరవాత నేషనల్ డిఫెన్స్ అకాడమీ పరీక్ష (ఎన్‌డీఏ) నిర్వహిస్తారు. దానిలో ఉత్తీర్ణత సాధిస్తే పూణేలో రెండేళ్ల శిక్షణ ఇస్తారు. అనంతరం ప్రతిభ ఆధారంగా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో అధికారులుగా నియమిస్తారు.

పరీక్షా విధానం

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా నిర్వహించే ఈ ప్రవేశ పరీక్ష పూర్తిగా రాత విధానంలో ఉంటుంది. ఆరో తరగతి ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు రెండున్నర గంటలు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు 3 గంటల సమయం కేటాయిస్తారు. ఆరో తరగతి పరీక్ష గుర్తింపు పొందిన అన్ని ప్రాంతీయ భాషల్లో, తొమ్మిదో తరగతికి ఆంగ్లంలో ఉంటుంది.


సైనిక్ పాఠశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు


విజయనగరం జిల్లా కోరుకొండలోని సైనిక్ స్కూల్ ముఖద్వారం

సిలబస్

- ఆరో తరగతి విద్యార్థులకు 300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. దానిలో గణితం 150, జనరల్ నాలెడ్జ్ 50, భాషా సామర్థ్యం 50, జనరల్ ఇంటెలిజెన్స్ 50 మార్కులకు ఉంటుంది. ప్రతి విభాగంలో కనీసం 25 శాతం మార్కులు తప్పని సరిగా సాధించాలి. అన్ని సబ్జెక్టులు కలిపి 40 శాతం మార్కులు రావాలి.
- తొమ్మిదో తరగతికి 400 మార్కులకు పరీక్ష ఉంటుంది. గణితం 200, సామాన్య శాస్త్రం 50, ఆంగ్లం 50, సాంఘిక శాస్త్రం 50, ఇంటెలిజెన్స్ 50 మార్కులకు కేటాయిస్తారు. ప్రతి విభాగంలో కనీసం 25 శాతం మార్కులు తప్పనిసరిగా సాధించాలి. అన్ని సబ్జెక్టులకు కలిపి 40 శాతం మార్కులు రావాలి. రాత పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు 1:3 నిష్పత్తిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

అర్హతలు ఇవే

ఆరో తరగతిలో చేరాలనుకునే విద్యార్థులకు 10 నుంచి 12 ఏళ్లు (01 ఏప్రిల్ 2013 నుంచి 31 మార్చి 2015) వయసు ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదో తరగతి చదువుతూ ఉండాలి. తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి 13 నుంచి 15 ఏళ్ల వయసు (01 ఏప్రిల్ 2010 నుంచి 31 మార్చి 2012), ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న వారు అర్హులు.

దరఖాస్తు చేసుకునే విధానం

ప్రవేశ పరీక్షను 2025 జనవరి 28న నిర్వహిస్తారు. www.aissee.nta.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ధ్రువపత్రాలను, విద్యార్థి ఫొటో, సంతకం అప్‌లోడ్ చేయాలి. జనరల్, డిఫెన్స్ కేటగిరీ అభ్యర్థులు రూ.650, ఎస్సీ, ఎస్టీలు రూ.500 ఫీజు ఆన్‌లైన్ లో చెల్లించాలి. తుది గడువు డిసెంబర్ 20. రిజిస్టర్ చేసుకున్న మొబైల్ నంబర్‌కు మెసేజ్ వస్తుంది. ఆన్‌లైన్‌లో పంపిన దరఖాస్తును విద్యార్థులు ప్రింట్ తీసి భద్రపరచుకోవాలి. జనన, కుల, నివాస, ధ్రువపత్రాలతో పాటు సైనిక ఉద్యోగుల పిల్లలకు సర్వీసు ధ్రువపత్రం, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు పీపీఓను అప్‌లోడ్ చేయాలి. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయనగరం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళంతో పాటు తెలంగాణలోని హైదరాబాద్, కరీంనగర్‌లో పరీక్షను నిర్వహిస్తారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,800
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	11,000 – 11,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విజయవాడలో డిసెంబర్ 27 నుంచి 29 వరకు జరిగే 35వ సౌత్ జోన్ జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు కాకినాడ క్రీడాకారులు ఎంపికయ్యారని స్విమ్మింగ్ సంఘ కార్యదర్శి, కోచ్ ఐ.రాజు మంగళవారం తెలిపారు. ఐకే దర్శిల్, ఎం.షణ్ముఖ వీర్, ఎం.యశస్విని, డి.మణికంఠ, నవీన్ ఎంపికైన వారిలో ఉన్నారన్నారు. వీరిని డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్, కోచ్ అప్పలనాయుడు, మంగా శివరామకృష్ణ అభినందించారు.

పోక్సో కేసు నమోదు

కాట్రేనికోన: మండల పరిధిలోని కందికుప్పకు చెందిన 17 ఏళ్ల బాలిక, పల్లంకుర్రుకు చెందిన 16 ఏళ్ల బాలుడు వివాహం చేసుకున్నారు. దీనిపై బాలిక తల్లిదండ్రులు సోమవారం కాట్రేనికోన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై అవినాష్ ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేశారు. దీనిపై అమలాపురం డీఎస్పీ టీఎస్ ఆర్‌కే ప్రసాద్, ఎస్సై అవినాష్ విచారణ చేపట్టారు.

జాతీయ రగ్బీ పోటీలకు విద్యార్థినులు


విద్యార్థినులతో పీడీ నాగలింగేశ్వరరావు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): బీహార్‌లో ఈ నెల 28 నుంచి 30 వరకు జరగనున్న జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు కాకినాడలోని అన్నవరం సత్యదేవి జూనియర్ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆ కళాశాల ప్రిన్సిపాల్ మూర్తి మంగళవారం తెలిపారు. స్థానిక డీఎస్‌ఏ మైదానంలో రగ్బీ జిల్లా అసోసియేషన్, ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో అండర్ - 17 ఎస్‌జీఎఫ్ఐ అంతర్ జిల్లాల రగ్బీ పోటీలు నిర్వహించారు. వీటిలో ఆ కళాశాలకు చెందిన పలివెల సునందశ్రీ, యర్రం జ్యోతి చంద్రిక ప్రతిభ కనబరిచి, రాష్ట్ర జట్టు విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు.

స్త్రీనిధి సొమ్ము రూ.22.50 లక్షలు గోల్‌మాల్!


కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన మహిళలు

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడి గ్రామ సంఘం–1 వీఓఏ కంచర్ల దుర్గ ఆ గ్రామంలోని 8 డ్వాక్రా గ్రూపులకు చెందిన సుమారు రూ.22.50 లక్షల స్త్రీనిధి సొమ్ములను కాజేసిందంటూ సభ్యులు ఆరోపించారు. ఆ వీఓఏపై చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. ఆ మహిళలు తెలిపిన వివరాల ప్రకారం.. డ్వాక్రా మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.15 వేలు, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రూ.10 వేలు ఇస్తారంటూ వీవోఏ దుర్గ నమ్మించింది. ఈ మేరకు ఎనిమిది సంఘాల సభ్యుల వేలిముద్రలు తీసుకుంది. వారికి తెలియకుండానే అప్పు కోసం బ్యాంకులో దరఖాస్తు చేసింది. స్త్రీనిధి ఖాతాల్లోకి వచ్చిన డబ్బులను సొంతానికి వాడుకుంది. అయితే వాయిదాలు కట్టకపోవడంతో గ్రూపు సభ్యులను వెలుగు సిబ్బంది ప్రశ్నించారు. దీంతో వీఓఏను నిలదీయగా అసలు విషయం బయటపడింది. అయితే తీసుకున్న డబ్బులు తాను కడతానని దుర్గ హామీ ఇచ్చి, అనంతరం పరారైంది. ఈ మోసంతో బ్యాంక్ మేనేజర్, వీఓఏ తల్లి అడపా వెంకటలక్ష్మి, అన్నయ్య అడపా శ్రీనుకు సంబంధం ఉందని సభ్యులు ఆరోపించారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో వివరాలు అడగగా పూర్తి సమాచారంతో కలిగిన రికార్డులు తీసుకురాకపోడంతో కేసు నమోదు చేయలేదని తెలిపారు.

ఇంటర్ పరీక్ష ఫీజుకు 31 వరకూ గడువు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఫీజు చెల్లించని విద్యార్థులకు తత్కాల్ స్కీం ద్వారా మరో అవకాశం లభించింది. ఇంటర్ బోర్డు ఆర్ఐవో ఎస్ఎస్‌వీఎల్ నరసింహం మంగళవారం ఈ విషయాన్ని తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన జనరల్, ఒకేషనల్ విద్యార్థులు రూ.3 వేల అపరాధ రుసుముతో ఈ నెల 31వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు.

జూనియర్ బాలికల కబడ్డీ విజేతగా శ్రీకాకుళం


శ్రీకాకుళం జట్టుకు ట్రోఫీ అందిస్తున్న కబడ్డీ అసోసియేషన్, సీఆర్‌సీ సభ్యులు

రావులపాలెం: జూనియర్ కబడ్డీ బాలికల చాంపియన్‌షిప్‌లో శ్రీకాకుళం జట్టు విజయకేతనం ఎగురవేసింది. ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్, సీఆర్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో రావులపాలెంలో నిర్వహిస్తున్న 50వ రాష్ట్రస్థాయి బాలుర, బాలికల జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు మూడో రోజు మంగళవారం హోరాహోరీగా సాగాయి. 13 జిల్లాల నుంచి 26 జట్లు లీగ్ కం నాకౌట్ విధానంలో తలపడ్డాయి. ఉత్కంఠగా జరిగిన పోటీల్లో బాలుర, బాలికల విభాగాల నుంచి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల జట్లు ఫైనల్స్‌కు చేరాయి. బాలికల విభాగంలో శ్రీకాకుళం విన్నర్‌గా, విజయనగరం రన్నర్‌గా నిలిచాయి. తృతీయ స్థానంలో విశాఖ, కృష్ణా జిల్లాలు సంయుక్తంగా నిలిచాయి. బాలుర విభాగంలో ఫైనల్ పోరు జరగాల్సి ఉంది. విజేతలకు కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గొలుగూరి వెంకటరెడ్డి, కార్యదర్శి వై.శ్రీకాంత్, సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, సెక్రటరీ కర్రి అశోక్‌రెడ్డి బహుమతులు అందజేశారు. సీఆర్‌సీ స్పోర్ట్స్ డైరెక్టర్ నల్లమిల్లి వీరరాఘవరెడ్డి, డైరెక్టర్లు చిర్ల కనికిరెడ్డి, మల్లిడి ఆంజనేయరెడ్డి, కొవ్వూరి నరేష్ కుమార్ రెడ్డి, చల్లగళ్ల గోపాలకృష్ణ, దండు సూరిబాబురాజు పాల్గొన్నారు.

మానసిక రోగి ఆత్మహత్యాయత్నం

- 70 శాతం కాలిపోయిన శరీరం
- కాకినాడ జీజీహెచ్‌లో ఘటన

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లోని మానసిక రోగుల వార్డులో చికిత్స పొందుతున్న ఓ మహిళ మంగళవారం ఆత్మాహుతికి యత్నించింది. వివరాల్లోకి వెళితే.. కాకినాడ రూరల్ మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన 33 ఏళ్ల గొల్లపల్లి విశాలాక్షి పదేళ్ల క్రితం తలలో చిన్న, పెద్ద మెదళ్ల మధ్య ఏర్పడ్డ కొవ్వు కణితి వల్ల మానసిక అనారోగ్యానికి గురైంది. అప్పటి నుంచి కాకినాడలోని కరణంగారి జంక్షన్‌లో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సైక్రియాట్రీ ట్రీట్‌మెంట్ పొందుతోంది. ఈ క్రమంలో మెరుగైన వైద్యం కోసం కాకినాడ నుంచి విశాఖపట్నానికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం ఆమె మానసిక స్థితి కొంత మెరుగైంది. అయితే కొద్ది వారాల నుంచి మళ్లీ తిరగబెట్టింది. ఎక్స్‌ట్రా పిరమిడల్ సింప్టమ్స్(ఈపీఎస్) అధికమై ప్రవర్తనలో తీవ్రమైన మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో సుమారు రెండు వారాల క్రితం కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు ప్రత్యేక వైద్య సేవలు అవసరమని నిర్ధారించారు. సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి ఆదేశాలతో సైకియాట్రీ హెచ్‌వోడీ డాక్టర్ రామచంద్రరావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఫీమేల్ సెల్‌లో ఉంచి వైద్య సేవలు అందిస్తున్నారు.


విశాలాక్షి తండ్రి గణపతి నుంచి వివరాలు సేకరిస్తున్న డాక్టర్ వరప్రసాద్

వైద్యుల పర్యవేక్షణలో..

విశాలాక్షి ఆసుపత్రిలో చేరినప్పటి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.శాంతి, పీజీ వైద్యుల బృందం వ్యక్తిగత పర్యవేక్షణ కొనసాగిస్తోంది. ఆమె చికిత్స పొందుతున్న గదిలో తల్లిదండ్రులు చిట్టి మాణిక్యం, గణపతి సంరక్షకులుగా ఉంటున్నారు. అయితే విశాలాక్షి మంగళవారం వారిని కొట్టడం మొదలు పెట్టింది. ఈ విపరీత ప్రవర్తనను గుర్తించిన తల్లిదండ్రులు ఆమెను గదిలోనే ఉంచి బయట గడియ పెట్టారు. మరో వార్డులో ఇతర రోగులకు సేవలందిస్తున్న వైద్యుల వద్దకు వెళ్లి, ఈ విషయం చెప్పి, వారిని విశాలాక్షి గది వద్దకు తీసుకువచ్చారు. అప్పటికే గది నుంచి మంటలు రావడాన్ని గుర్తించారు. కంగారుగా గడియ తీయగా విశాలాక్షి నిప్పంటించుకొని కాలిపోతూ కనిపించింది. ఆమెను రక్షించేందుకు డాక్టర్లు శాంతి, పవన్ తీవ్రంగా శ్రమించారు. దుప్పటి తీసుకొచ్చి కప్పి మంటలను అదుపు చేశారు. ఈ క్రమంలో డాక్టర్లతో పాటు తండ్రికి స్వల్పగాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స అనంతరం విశాలాక్షిని బర్న్స్ వార్డుకు తరలించారు. అయితే సుమారు 70 శాతం మేర శరీరం కాలిపోవడంతో ఆమె ఆరోగ్య స్థితి ఆందోళనకరంగా ఉందని డాక్టర్ లావణ్య కుమారి తెలిపారు. ఘటన జరిగిన ఫీమేల్ సెల్‌ను డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్ పరిశీలించారు. నిప్పంటించుకునేందుకు దారితీసిన కారణాలపై తండ్రిని ఆరా తీశారు. మస్కిటో కాయిల్స్ వెలిగించేందుకు తానే అగ్గిపెట్టెను గదిలో ఉంచానని, గడియ పెట్టి తిరిగి వచ్చే సరికి తన కుమార్తె ఆత్మహత్యాయత్నం చేసిందని తండ్రి గణపతి వాపోయాడు. ఈ ఘటనపై కాకినాడ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

స్వామి సాక్షిగా పక్షపాతం

- కూటమి నేతల చేతుల్లో భీమేశ్వర ఆలయం
- ప్రజాప్రతినిధులకు దక్కని గౌరవం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయం ప్రస్తుతం కూటమి నాయకుల చేతుల్లోకి వెళ్లిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులకు గౌరవం దక్కడం లేదని తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే. ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దేవస్థానం 2025 క్యాలెండర్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ఆవిష్కరించారు. అయితే ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలతో సహా ఎంపీపీ, జెడ్పీటీసీలకు కబురు చేయలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఇక్కడ ఈఓగా పనిచేసిన పితాని తారకేశ్వరరావు, అప్పటి నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సహకారంతో ఆలయాన్ని విశేషంగా అభివృద్ధి చేశారు. దీనిలో భాగంగా దేవస్థానం తరఫున క్యాలెండర్ వేయించడం ప్రారంభించారు. దీని ఆవిష్కరణను పండగ వాతావరణంలో నిర్వహించేవారు. గత రెండేళ్లుగా మంత్రి వేణు చేతుల మీదుగా జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొనేవారు. అయితే సోమవారం జరిగిన 2025 క్యాలెండర్ ఆవిష్కరణలో మాత్రం మంత్రి సుభాష్‌తో పాటు కూటమి పార్టీలకు చెందిన నాయకులు మాత్రమే పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన సమాచారం మేరకు ద్రాక్షారామ సర్పంచ్ హాజరయ్యారు.

- ఇటీవల కార్తిక మాసం చివరి మంగళవారం ఆలయ ప్రాంగణంలో ప్రసన్నాంజనేయ బాల భక్త సమాజం ఆధ్వర్యంలో కార్తిక దీపారాధన మహోత్సవం నిర్వహించారు. దానిలో భాగంగా సినీ, భక్తి గీతాల కార్యక్రమం, నాటకాలు వేసిన వేదికపై మరుసటి రోజు షిరిడీ సాయిబాబా నాటకం ప్రదర్శించడానికి కమిటీని సంప్రదించి ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే దీపారాధన మహోత్సవం రోజున రేపు సాయిబాబా నాటకం ఉందని మైకులో చెప్పడంతో భీమేశ్వరాలయంపై పెత్తనం చేస్తున్న ఒక కూటమి నేత అడ్డు చెప్పాడు. సాయిబాబా నాటకం ఇక్కడ ప్రదర్శించడం కుదరదని ఆదేశాలు ఇవ్వడంతో చేసేదేమీ లేక నిర్వాహకులు హసన్‌బాదలోని సాయిబాబా ఆలయం వద్దకు ప్రదర్శనను మార్చుకున్నారు.
- ఇటీవల ఆలయంలో నిర్వహించిన దసరా మహోత్సవాలకు ఆలయం తరఫున వేసిన ఆహ్వాన పత్రికలో ఆలయం ఉన్న ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీటీసీ, మండల వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి పేరు వేయలేదు. ఇదే గ్రామంలో రెండో ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీటీసీ-2 నున్న సత్యవతి పేరును రాశారు.


కూటమి నాయకులతో క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి సుభాష్ (ఫైల్)

నిందితులకు జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో పది మందికి రెండు రోజుల చొప్పున జైలు, మరో పది మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరు పర్చగా పైవిధంగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మరో కోర్టులో..

మద్యం తాగి బైక్ నడిపిన కేసులో ఆరుగురికి రెండు రోజుల జైలు, 19 మందికి ఒక్కొక్కరికీ రూ.పది వేలు చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్.వీరభద్రుడు తీర్పు చెప్పారు. కాకినాడ వన్ టౌన్, కోరంగి, గొల్లపాలెం, పెదపూడి పోలీసు స్టేషన్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి బైక్‌పై వెళ్తుండగా వారిపై కేసులు నమోదు చేశారు.